# బస్ కండక్టర్




'మృత్యుంజయా ట్రాన్స్‌పోర్టు సర్వీసు' తాలూకు బస్సు 'స్టాండు'లో ఆగి వుంది. దానిచుట్టూ-తేనెపట్టుచుట్టూముసిరే తేనెటీగల్లా జనం టిక్కట్లుకోసం ఎగబడుతున్నారు! అబాలగోపాలం కచ్చాబిచ్చా కుమ్ములాడుకొంటూ, నేనుముందంటే, నేనుముందని కరెన్సీనోట్లు ఆర్థికసామ్రాజ్య ప్రతిపత్తి ఎగరేసిన జెండాల్లా గాలిలో టెపటెపలాడిస్తూ ఎగబడుతున్నారు ప్రయాణికులు.

'జేబుల్లోపర్సులు జాగ్రత్తండోయ్'గొంతు చించుకొంటున్నాడు కండక్టరు. ఆడవాళ్ళని, ముసలివాళ్ళనీ దూరప్రయాణీకుల్ని కనిపెడుతూ టిక్కట్లు చింపుతున్నాడు, నోట్లు మెడకు వ్రేలాడదీసిన తోలు సంచీలో కుక్కుతూ....

ప్రయాణీకుల నిట్టూర్పులు ముఖాన్ని వెచ్చని సెగలుకొడుతున్నాయి. టిక్కట్లు దొరకనివాళ్లు బస్సువాళ్ళపై దీవనలు కురిపిస్తున్నారు.

డ్రయివరు కారుకి జారబడి తాపీగా బీడీదమ్ము లాగుతున్నాడు.

'బలిపట్నం శివారుకో టిక్కెట్టిప్పించయ్యా....పొద్దుణ్ణించీ తిండితిప్పల్లేవు ... కండెట్టరుబాబూ!'—గుంపులో చొరబడలేక గుంపవతలినించి మూల్గింది వణుకుతూ ఓ ముసలమ్మ.

కండక్టరు చూశాడు. 'రా! మామ్మా రా!' అని కిందకిదిగి దారిచేసి బస్సెక్కించుకొన్నాడు.

'బాబూ! నీకడుపు చల్లగా వెయ్యేళ్ళు వర్ధిల్లు! టిక్కెట్టు దొరక్క అల్లాడిపోతున్నా పొద్దుణ్ణుంచీ దేవుళ్ళా రక్షించావు!' అంటూ దీవించింది.

కండక్టరు టిక్కెట్లు లెక్కపెట్టుకొంటున్నాడు. లావుగా కండలు బలిసి, బుంగమీసంతో చూడ్డానికి భయంగావున్నా—'మాట్టాడితేమాత్రం....పాపం! వట్టి బోళామనిషి .... పిచ్చిముండావాడు ... మంచివాడు....అనిపించేలా కనిపిస్తాడు.

'మొహమొహాలుచూచి యిస్తున్నాడు టిక్కెట్లు' అన్నది గుంపులో ఓగొంతు కర్కశంగా.

'వాళ్ళిష్టం....ఎవరడిగేవారు? పోలీసువాణ్ణీ, కారుకండక్టరునీ, నమ్మకూడదని ఊరికే అన్నారూ? టిక్కట్లు బ్లాకు.... మనిషే బ్లాకు....ఎప్పుడో పాపం పండకపోదు'—అన్నది మరోకంఠం శాపంగా. కండక్టరు అన్నీ గుక్కిళ్లుమ్రింగుతూ, కళ్ళల్లో జీర్ణించుకొంటూ అందరి దీవెనల్ని అందిపుచ్చుకొంటూ—'సీటరైంది. రయిటో' అన్నాడు.

డ్రయివరు సగంకాలుతోన్న బీడీ క్రింద పారేసి, కాలితో చరచర నలిపేసి 'స్టీరింగ్ దగ్గర కూలబడి స్టార్టు' చేశాడు. 'ససేమిరా' కదలనంటే కదలనంది బండి. జనంతో కిటకిటలాడుతోంది.

రచయిత :

"కాంతప్రియ"

'శ్రీమద్రమారమణ గోవిందోహరి........ తోపుడుబండి మెరికల్లాంటి కుర్రోళ్లు పదిమంది దిగండిబాబూ! దిగండి! నేను పూర్వజన్మలో చేసుకొన్న కర్మ. హైలేసా, అని వేళాకోళం చేసుకొని, బండి తోశాడు. ముందుచక్రాలు రెండంగుళాలు ముందుకు కదిలి, నాలుగంగుళాలు వెనక్కి వెళ్లాయి. ఈలోపులా అయిదారుగురువచ్చి సాయం పెట్టారు. పదిగజాలు ముందుకు నడిచాక ఇంజను చీదుకుంది. వెనకచక్రాలు గాలి పూటుగావుందో లేదో చూసుకొన్నాడు కండక్టరు.

దిగిన జనం మళ్లీ బిలబిలలాడుతూ ఎక్కారు బస్సు. 'మా వోనరు వట్టి బీదోడండి, పాపం! ఓవంద యెకరాలకి తక్కువ లేదనుకోండి! సాలుకి లక్ష రూపాయలొచ్చినా, ఇంజిను బాగుచేయించడండి! ఇదంతా నాకర్మ కొచ్చిపడిందనుకోండి!' అని తలమీద వేళాకోళంగా నవ్వుతూ బాదుకొన్నాడు. బస్సులో జనం గొల్లుమని నవ్వారు.

'బకాసురుళ్లాటి నువ్వున్నావుగా! ఒక్క తోపుతోశావంటె వెళ్లి మృత్యుంజయపురం పోయిపడద్ది'—నల్లగా పొట్టిగావున్న కళ్లజోడబ్బాయి చమత్కరించాడు.

'అదేంటయ్యోయ్! కండక్టరు నేకండానే బస్సు నడిపించేస్తావేంటి?........నేను సీట్టు సివర కూసోకపోతే బండికి, అరక సాలొద్దూ?....' అని వికటంగా నవ్వాడు. ప్రయాణికులూ పగలబడి నవ్వారు.

నవ్వాగి బస్సు పరిగెడుతోన్న హొరు చెవుల్లో పోరుపెడుతోంది.

జనాన్ని మరోసారి లెక్కెట్టుకొంటూ, 'అదేంటమ్మోయి' నిండుసూలాలివి! వెనకసీట్లో కూచున్నావు! అసలే గవర్మెంటు కంట్రాక్టర్లరోడ్డు....ఒకటే గతుకులు గతుకులు....ఒక్కొగతుకులో కారుసెక్రం పడ్డాదంటే మనబస్సుఆకాసానికెగిరికిందపడద్దీ. ఈలోపులో నీకు నొప్పిలొచ్చి, పురుడొస్తే నేనెక్కదొయ్యగలనుతల్లీ! ఇప్పటికే నా కిద్దరప్పాసెల్లెళ్ళున్నారు. ఒకళ్ళనిడిసి ఒకళ్ళు ఏడాదికి రెండుసార్లు పంతాలమీదొచ్చి పురుళ్ళోసుకొంటారు. అప్పగారు ఆడపిల్లనుగంటే—సెల్లెలు మగపిల్లోణ్ణి—సెల్లెలు ఆడపిల్లనైతే—అప్పగారు మగపిల్లోణ్ణి కడుపుతుంది కనుక్కొన్తన్నారు మూడేళ్ళనించీ—మాతల్లివిగావూ మజ్జెసీట్లోకూర్చో' అని కారు ఆపించి ఆస్త్రీని తగుస్థానములో కూర్చోపెట్టించాడు. జనము గలగల నవ్వుకొన్నారు. నిండుచూలాలు సిగ్గుతో తలవంచుకొంది.

'ఐతే నువ్వు అప్పాసెల్లెళ్ళమజ్జె నడిపోడివన్నమాట' అన్నాడెవరో పల్లెటూరతను.

'ఔనయ్యా! బస్సు నడిపేవోణ్ణి నేనే'—అన్నాడు నోట్లు లెక్కెట్టుకుంటూ. మళ్ళి నవ్వారు.

'డ్రయివరుకి నవ్వులాటకంటకముగా వున్నట్టుంది—'సొల్లిగాని సరదాలు – కేసు ఫారము నూనుకో' అన్నాడు చిరాగ్గా. తిక్క పాయలా వున్నాడు.

'అ(....కండెక్టరు భలేమంచి చమత్కారి సుమండీ!' అన్నారు ఓ నామాల ఆచార్యులవారు పక్కనున్న శెట్టిగారితో. 'అ( ఏంసెమత్కారం లెద్దురూ?... టిక్కట్లప్పి ల్లాకే! నాదో అణా ఎక్కువైంది....'

'సిల్లర్–సిల్లర' అని కేకవేశాడు కండక్టరు....ఎవరెవరి కెంతివ్వాలో గుర్తుగా.... లెక్కపెట్టి యిచ్చేస్తున్నాడు.

'నాకో అణారావాలి సిల్లర' అన్నాడు శెట్టిగారు. 'ఏవండోయ్ శెట్టిగారు! ఆ పప్పులు నాదగ్గరుడకవు. నువ్వసలు వా దగ్గర్నుంచి టిక్కెట్టిచ్చుకున్నావుటయ్యా'

డ్రయివరుచేతో 'స్టీరింగ్' వయ్యారాలు పోతోంది. 'కేసుఫారం పూర్తి చెయ్యవయ్యా! చెకింగ్‌గుమాస్తా వచ్చేడంటే గూటించేస్తాడు.' మళ్లీ హెచ్చరించాడు.

వాయసపట్నము దాటి దారినిపడింది కారు. రోడ్డుకిరుప్రక్కలా మామిడితోటలూ, జామితోటలూ, కొత్తగా పంచవర్షప్రణాళిక కింద నిర్మింపబడుతోన్న భవనాలు బారులూ, గట్లొరిసిపారే చెరువులూ, విశ్రాంతిలేకుండా సాగుతోన్న పంటకాలువలూ....అన్నీ దృష్టిపథంలోంచి చెరిగిపోతున్నయి.

'హోల్డాన్' — కండక్టరు కేకవేశాడు. ఛర్రున ఆగింది బస్సు. రోడ్డువార జామికాయలగంప పెట్టుకూర్చున్న తాతని కేకవేశాడు.

'గంపెడు జామికాయలెందుకు? కుతేలంతా సామానేమో?'

'ఎవరేనా తెచ్చిపెట్టమని డబ్బిచ్చి వుంటారు'

'తిరిగి అమ్ముకోడానికి ఇంటి దగ్గర చిల్లరదుకాణమేమో?'

డ్రయివరు ఈనడించుకొంటూ—'ఈ పికిదో పిచ్చి రోజా ఏయో కాని, దారినిపోయే కుర్రాళ్ళకి ధారబోస్తుంటాడు. అత్తగారి సొమ్ము అల్లుడు ధారబోసినట్టు అన్నాడు.

చివర తలుపుదగ్గర కాలు చిత్రంగా మోపెట్టుకు నిలబడి—క్యాషుఫారం పూర్తి చేసుకొంటున్నాడు కండక్టరు.

'నాయనా! అలా నిలబడితే పడిపోవూ? సరిగా కూచో తండ్రీ!' ఎవరో మామ్మగారు ఆత్రంగా అన్నారు. కండక్టరు నవ్వాడు.

'నా పేణం గట్టిదండోయ్ మామ్మగారు! చిన్నప్పుడు నామీంచి బండిచక్రం యెళ్ళిపోయినా బతికేను గజమొండిని....ఇదంతా



'లేదు లేదు. బోకరతనికిచ్చాను.'

'అలారా! దారికి' అని; 'నయాపైస ఎక్కువ నాకక్కరలేదయ్యోవ్'— అని కోపంగా చూశాడు.

'చూశారా? ఎలాంటి శతావధానవో' యిది! ఎవరెంతయిచ్చిందీ గుర్తుపెట్టుకొని మిగతాచిల్లర నయాపైసా తేడారాకుండా తేల్చిపారెయ్యడం...? ఎఱ్ఱగా పొట్టిగా వున్న బట్టతలాయన కండిక్టరు చమత్కారానికి నవ్వి నవ్వి పొట్ట చేత్తోపట్టుకొని పక్కపేపర్లో తలదూర్చుకొని కూచునివున్న గుమాస్తా గిరి(శం)తో అన్నాడు.

ఒకసారి తల పైకెత్తి గుమాస్తా గిరి(శం) చిరునవ్వు నవ్వేసి, పేపరుమడత తిప్పాడు.

'ఎంత? గంప'—అడిగాడు కండక్టరు.

'మీకెందుకు బాబూ!' జామికాయల తాత సందేహంగా అన్నాడు. రొండు రూపాయ లిప్పించండి!'

కండక్టరు రెండురూపాయల నోటు యిచ్చేసి, బస్సులోకి లాక్కొన్నాడు గంప. 'రయిటో'

బస్సు కదిలింది. జామికాయల తాత 'గంప బాబోయ్' అని కేకవేసుకొంటూ వెంబడించాడు.

'మళ్ళీ యిలావచ్చేటపు డిచ్చేస్తా'....

బస్సులో జనం ఎందుకొన్నదీ అర్థం కాక గుసగుసలూ....పకపకలూ పోయారు.

అలవాటు తల్లి! అలవాటు! మా తాత బస్సు డ్రయివరు, మా నాయన కండెక్టరు, మా మావగారు లారీడ్రయివరు అంతా, పొద్దున్నించీ సాయంత్రందాకా ఈ బస్సులు లారీలమీదనే బతికేదుస్తున్నాం, ఇదంతా మా కర్మం!'

బస్సు దారికడ్డంగా వచ్చే పశువుల్నీ, మేకమందల్నీ, నాటుబండ్లనీ తప్పించుకొనిపోతూంది చిన్నకార్లకి దారి యిస్తుంది. వెనకనించి గొడ్లుకాసే కుర్రాళ్లు గొల్లుమని గోలపెడుతూ వెంటపడుతున్నారు.

వాళ్ళందరికీ 'పండందుకోండి రోయ్' అని జామికాయలు విసిరేస్తున్నాడు కందుకక్రీడలా కండక్టరు. ఆప్యాయంగా అందిపుచ్చుకొని తింటున్నారు. ఉత్సాహంగా

నవ్వుతూ ప్రేలుతూ కాలం దనంతవరకూ పరిగెడుతున్నారు పగలబడుతున్నారు.

బస్సులో ప్రయాణీకు లందరూ ఇదో వింతభోరణిగా అనుభూతిపొందుతున్నారు.

'పాపం పిల్లాజెల్లా లేరు కాబోలు! కాకికి చేయివిదల్చని యీ రోజుల్లో మనుషులందరినీ మించి అతని అభిమానం, ఆప్యాయతా-వాత్సల్యం చూశారా' అనుకొంటున్నారు జనం.

'అయ్యో బుజ్జాం రేపు పోతాం తనువులు శాశ్వతమా సెప్పండి! ఉన్నంత కాలం దానం, ధరమం మంచీ చెడ్డా చూసుకుపోవాలి' గాని అంటూ కార్లో పిల్లలకి కూడా జామికాయలు పంచాడు.

కండక్టరుని గురించి, పదిమందీ పది విధాలుగా భావించుకోవడం డ్రైవరుకి ఉత్సాహంగా వుంది. తెక్కపాయతా తెప తెపలాడిపోతున్నాడు.

'అరక సరిపోతేదేటి? తమ్ముడూ! ముందూ ఎనక్కి ఊగులాడుతున్నావ్? సెక్రం నీచేతిలోవుంది. మా పేణాలన్నీ నీ గుప్పిట్లో వున్నాయి. సరిగా నడువు తమ్ముడూ!' డ్రయివర్నుద్దేశించి హాస్యమాడాడు.

'దావటెద్దూ—ములపటెద్దూ లాంటోళ్ళం మేమిద్దరం ఈ బండికి' అని ఫకాల్మన్నాడు కండక్టరు.

'నీపేరేంటి కండక్టరూ?'

ఎవరో బుగ్గమీసాలాయన అడిగాడు.

'ఏదో పేర్లెండి! మాఅమ్మ నన్ను కడుపుతున్నపుడు, ఓరోజు నెలల్నిండినాక తేగలు తినాలని బుద్ధిపుట్టిందంట! దాని తస్సాదియ్యా! అది ముంజెకాయలటయం తేగలెలా దొరుకుతాయి? సిత్రం! మాయింట్లో గాదిమూల ఓ తేగ ఎండిపోయి దొరికిందట! అది తిని నన్ను కన్నాదంట! అప్పట్నుంచీ నన్నందరూ తేగలయ్య, తేగయ్యా అని పిలుస్తున్నారు'—

మళ్లీ జనం ఆ బాల గోపాలం నవ్వుల తరంగాల్లో మునిగితేలారు.

'అదేంటబ్బాయి! నిజేవంటా త్యాగయ్యా అని పిలిపించుకో! సంగీతపు మెట్లుమీద భగవానుడి చరణ సన్నిధికి చేరుకొన్న మహానుభావుడు త్యాగరాజు. ఆయన పేర్పెట్టుకో!'—అన్నాడొక సంగీతశాస్త్రజ్ఞుడు.

పేపరు ముహానికడ్డం పెట్టుకొని, అందులోమునిగిపోయిన గుమస్తా గిరి(శం) ఉన్నట్టుండి కెవ్వన కేకేసి 'బస్సుప్రమాదము. బదరీనాథ్‌నించి హృషీకేశం వెళ్లే దారిలో ఘోరప్రమాదం నలభై యిద్దరు దుర్మరణం కండక్టరు డ్రయివరు దూకేసి తప్పించుకొన్నారు' అని చదివాడు.

'బాబ్బాబూ! అలాంటివి సదవమాకండి! అసలే మాబస్సు మహాసెడ్డది. ఇన్నాదంటే ఇహ వదిలిపెట్టదు. తరవాత మీయిష్టం' అని కండక్టరుబతిమాలేధోరణిలోఅన్నాడు.

ఫక్కుమని నవ్వుకొన్నారు జనం. కండక్టరుని గురించి పొగడ్డం, జనం ఉత్సాహపడటంచూసి డ్రయివరు మూహంముడుచుకొన్నాడు.

ఓపల్లెటూరుమధ్య ఒక యింటిముందు బస్సు ఆగింది.

ఓ అమ్మాయి భోజనంకేరేజి పట్టుకొని 'మావా! మావా! అని కేకవేసింది. ఉత్సాహంగా పొంగిపొర్లుతూ కండక్టరు దగ్గిరికి పరువెత్తుకొచ్చింది.

'నీకిష్టమనిమావా! ఇయ్యాలన్నీ సేసేను అత్త దగ్గరుండి సేయించింది. కోడిగుడ్డట్టు రొయ్యపొట్టు చారూ—'అని ఉత్సాహంగా చెప్పుకుపోతోంది.

'ఊఁ స్సాల్లే! కార్లో బేమర్లూ, కోవట్లూ ఉంటారు. యిన్నారంటే వొదిలిపెట్టరు... సరేగాని, నువ్వెళ్లి అడుకో! అత్తకు సాయముగా వుండు నే నింక రాను.'

ఏది అన్నట్టుచూసి 'నైట్ ఆట్లా?' అందా అమ్మాయి.

'ఆఁ'—సరేగాని, నీకియిగో రిబ్బన్లూ, పవుడరుడబ్బా, తిండానికి మిఠాయీ అన్నీ పట్టుకెళ్ళు' అని పిల్లకందించి ఎత్తుకు ముద్దాడి దింపాడు.

ఇల్లాలు అరుగుమీదనించి కాబోలు తొంగిచూస్తోంది 'రయిటో'అన్నాడు బస్సు కదిలింది. బస్సు కనిపించేటంతవరకూ పిల్లా యిల్లాలూ చూస్తూనేవున్నారు.

'ఏటోనండి! గుడిసంసారం గూడు బంగారమని, మా సంసారానికి పిల్లనే—అక్కయ్యకూతుర్నే ముద్దుముచ్చటికి పెంచుతున్నాం. ఆడపిల్ల—అళ్ళ అత్తకి అసరా. సెంబూ, తపేలా అందిస్తావుంటుంది....మా అవిడ ఒఠి జబ్బుమనిషి. నా జీతం జీతం దాని మందుకైపోతంది. ఏం జెయ్యదం సెప్పండి! సేసుకున్నావోళ్లకి సేసుకొన్నంత మహాదేవా?' అని అన్నాడు. కళ్ళలో గిర్రున నీరు తిరిగింది. ప్రాణానికి సుఖం లేకపొయ్యినా, నవ్వుతూ ప్రేలుతూ, జీవితాన్నంతా అలా చమత్కరించుకుంటూ బతికిపోతున్నట్టు కనిపించాడు. అందరూ ఒక్కసారి నిట్టూర్చినట్టయింది వాతావరణము. దారిపొడుగునా పొలాలగట్లనించి పొంగిపొరలుతోన్న గంగ పరదలెత్తిపారుతోంది. వరిచేలు జలస్తంభనంతో తపస్సు చేస్తున్నట్టున్నయి!

'నిరుడల్లా ఒక్క నీటిసుక్కలేక పొలాలన్నీ నెరియలిడ్డాయి. తాగనానికి సుక్క నేదు. తిండానికి గింజనేదు. ఈ యేడాది సూడు నా తడాఖా అని ఒకటే వరద తగిలింది—ఈ యెంపనంతా సూడండిబాబూ యివరీతం—ఐతే అతివృష్టిలేకపోతే అనావృష్టి' —కండక్టరు వ్యాఖ్యానించాడు కాలాన్ని. లోకాన్నీ—

'ఇక్కడాపండి! దిగుతాం' — రాఘవేంద్రపురం గేటుదగ్గర ఆగింది బస్సు. ఎవరో యిద్దరు దిగారు మరి నాలుగడుగు లేసేసరికి ఎవరో ఒకరెక్కారు. ఒకళ్లెక్కితే, మరోరు దిగితే బండి కదుల్తూంది—

ప్రపంచంలోబ్రతకడంకూడా జూదంలా ఐపోయింది. అందులో మనుష్యులికిమనుష్యుల్నే పావులుకింద ఉపయోగించుకొనే పెద్దమనుష్యులున్నారు. బస్సు నెమ్మదైంది హార్న్ మ్రోగిస్తున్నాడు డ్రయివరు. గొంతుచించుకొంటూ — 'సెవిటి ముసిలిముండాకొడుకా! బయ్యోయని 'హార్న్' మ్రోగించుతున్నా యినపడదేం? — అని కసురుకుంటున్నాడు.

కండక్టర్ గభీల్మని క్రిందకురికి నడవలేక నడుస్తోన్న ముసలితాతని, 'రా తాతా! రా! కాలెక్కు ఎంత దూరంనించి వస్తున్నావో?'

ఓ ఎముకలగూడు కాళ్లోకెక్కింది కరే పాకుగంపల కావిడిమోస్తూ—తాత కండక్టరికి దణ్ణంబెట్టాడు రెండుచేతులూ జోడించి

ముసిలితొక్కు నడవలేదు! డబ్బులేదు కర్వేపాకు అమ్మితేనేగాని భుక్తి గడవదు. ఏదో కనిపెట్టకపోతే ఎలా చెప్పండి—

జాను పాపం — సానుభూతి ఒలికించింది బస్సు.

'ఊఁ సాలించులే! యెవ్వారం చెకింగ్ గుమాస్తా వచ్చేడంటే తాడుతెగుద్ది' కొంప మునిగినట్టు కేకేశాడు డ్రయివర్.

మరి కొంతదూరం పోయేసరికి గుమస్తా తణిఖీకి ఎక్కాడు. కరివేపాకుకావిడి తేడా తాగానే కొంప మునిగినట్టు కేకేశాడు. 'రిమార్క్' రాసేస్తానని బెదరించాడు.

'నీకి బస్సు కొత్తల్లె వుందయ్యా! నీ యిష్టంవొచ్చినట్టు రానుకో' నా సంగతందరికీ యెరికేలే! ఆఖరికి ఇన్స్పెక్టరూ, ఓనరూ ఎవరేనాసరే! నీ యిష్టం రిపోర్టు రానుకో'—

'బాబూ! నీకు మాట రానిచ్చుకోకు! నే దిగిపోతా' అని తాత లేవబోయాడు.

'కూసో తాతా! కూసో! నీకు భయంలేదు' అని అభయహస్తం చాచాడు కండక్టర్.

చెకింగ్‌గుమాస్తా దిగిపోయాడుకోపంగా.

బలిపట్నంలో ఓ యింటిముందు బస్సాగింది ఎవరో చెయ్యూపితే....

డ్రయివరు బస్సెక్కుతోన్న ప్రయాణీకురాల్ని చూసి హుషారుగా యీలవేశాడు. కరివేపాకుకావిడి, మరో మామ్మగారు దిగిపోయారు.

'అఁహాఁ—మహాతల్లీ రా అమ్మారా!.... ఏవూరి కొంపలార్పడాని కెళతందోవ్?' అన్నాడు కండక్టర్ చేతులు జోడించి.

జనం విరగబడి నవ్వుకొన్నారు.

కళ్ళు మూసుకువున్నట్టే మూసుకున్నాడు కండక్టర్. ఆ కళావంతులకాంత నైలాన్ చీర—అచ్చుగుద్దినట్టు జాడీ—ముంతుకుపొడుచుకొచ్చిన వక్షస్థలం పెదవులకి ఎఱ్ఱనిరంగు—చెక్కిళ్లకి గులాబీరంగు—లోతుగాపోయిన కళ్లకికాటుకరేఖ కృత్రిమమైన అలంకారాలు రెండుచేతుల్లో ఒక చేతికి వాచీ రెండోచేతికి రాళ్ళగాజుల చుట్టు—

జనంలో శృంగారవాసనలు వీచికలు వీస్తున్నై.

'ఏ వూరు తల్లీ!'

'మృత్యుంజయపురం' డబ్బులు పైకి తియ్యటానికి రవికచాటున దాచిన నయిలాన్‌పర్సు బయటికి తీయబోయింది.

డ్రయివరు తెక్కపాటుచూపులు పదే పదే వెనక్కి తిరిగిచూస్తున్నాయి.

'ఒరేయ్ తేగయ్యా! డబ్బులిచ్చుకోకురా! నేనిచ్చేస్తా' కళావంతురాలు ఆమాట వినపడగానే పర్సు లోపలికి తోసిపారేసింది చిరునవ్వు పెదవులమీద పూసుకుని....

'అది సరేగాని నువ్వు నాసీట్లో కూచోరా! నేను నీసీట్లో కూసుంటాను. అప్పుడు బండి బాగా నడుస్తుంది. చాలుచాల్లేవోయ్ స్టార్టు చేయడం మానేసి....' అన్నాడు కండక్టరు వినువుగా.

జనం మళ్లీ నవ్వుల్లో తేలిపోయారు. కళావంతురాలు అందరితో శ్రుతికలిపింది.

డ్రయివరుకి ఉత్సాహము వెనకవైపు పొంగిపొరలుతోంది. స్టీరింగు చెప్పినట్టు వినడంలేదు. కళ్ళు వెనక్కేవుంటే యెంత బావుణ్ణు అని అనుకొంటున్నాడు.

'తిన్నగా పోనీరా బండి! జాగర్తరోయ్' కండక్టరు హెచ్చరిస్తున్నాడు. చమత్కారముగా భావించి జనం పకపకలాడుతున్నారు.

బలిపట్నం దాటిపోతోంది బస్సు. మృత్యుంజయపురంశివారు సమీపిస్తోంది. చేతిలో స్టీరింగు చెప్పినట్టు వినడంలేదు. డ్రయివరుకి ముచ్చెమటలు పోస్తున్నాయి. స్టీరింగ్‌మీద, దేవుడిమీద భారంవేసి కూచున్నాడు.

అత్యంతేవి కేకలేస్తున్నాడు. స్టీరింగ్ చేతుల్లోంచి కంట్రోలు తప్పిపోతోంది. చక్రాలు గిరగిర తిరిగిపోతున్నాయి గావు కేకలేస్తున్నాడు.

జనం మ్రాన్పడిపోయారు.

త్యాగయ్య మొఖాన కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు. గబగబ మధ్య కవాటందగ్గరి కొచ్చి నిలబడ్డాడు.

గర్భిణీస్త్రీ కడుపులో పాపాయి గొంతెత్తి యేడ్చాడు. గుమాస్తా గిరి(శం) బస్సు ప్రమాదం పేజీ గబగబ చదివేస్తున్నాడు.

శెట్టిగారు—'నా బంగారం లాంటి ఆస్తి బాబో' అని దేవురిస్తున్నాడు.

శాస్త్రిగారు—'హరేరామ హరేకృష్ణ హరే హరే' అని కారునిండా రాసిపారేసిన భగవన్నామం జపిస్తున్నారు.

కళావంతురాలి ముఖంలో రంగు రంగులు మారిపోతున్నాయి. అందరి గుండెల్లో కారుచక్రాలు గిరగిర తిరిగిపోతున్నాయి. ప్రాణాలు పైకితీసుకుని నిశ్చేతనంగా గుప్పిట్లోపెట్టుకొని కూచున్నారు. నలభై యిద్దరూ ఆ బాలస్త్రీ వృద్ధం—దిగిపోయినవాళ్ళు పుణ్యాత్ములు....ఎక్కవున్న వాళ్ళంతా పాపాత్ములు.

ప్రతీక్షణం మృత్యుప్రమాదంలోకి చొచ్చుకుపోతోంది కారు. రకరకాల మనుష్యులతో మనస్తత్వాలతో కిటకిటలాడుతోన్నకారు మృత్యుకోరలమధ్య చిక్కి ఏ క్షణంలో తునాతునకలై పోతుందో? ఆ క్షణం ఎదురుచూస్తున్న దుర్ముహూర్తం—అందరికళ్ళు భయంతో దైన్యంతో విషాదంతో నిండి బరువెక్కిపోయాయి.

కండక్టరు త్యాగయ్య నోటమాటతేదు. డ్రయివరు మృత్యువుతో హోరా హోరీ పోరాడుతూ గట్టిగా కళ్ళుమూసేసుకొని, దారిప్రక్కన గడ్డిమేట్లోకి దూకేశాడు.

కండక్టరు త్యాగయ్య మధ్యకవాటం దగ్గర నిలబడి, 'చక్రాలట్టుకోండో హెూ' అంటూ కిందికి దూకేసి కారు[కింద]కి దూక

పోయాడు. తిరిగిపోతోన్న వెనకచక్రాల కడ్డంబడ్డాడు — అతని మహాస్థూలకాయం ఇన్నాళ్లికిందుకా ఉపయోగపడత? నలభై మంది ప్రాణాలు రక్షించడానికా?

కాల్వపారుతోంది ఉధృతంగా. మృత్యు వంతెనలాంటి వంతెన — తూము పక్క ఏనాటిదో అశ్వాకులనాటిరావిచెట్టు రెంటికీ మధ్యగా వెళ్ళి కారు టక్కున నొక్కుకుని ఆగిపోయింది. ముందుచక్రాలు గిరగిర తిరిగిపోతున్నాయి. బంతి కదలకుండా వెనక చక్రాలకింద మోపెట్టినట్టు నలిగి పోతున్నాడు త్యాగయ్య. ఒట్టిమాంసపు ఫెళఫెళవిరుగుతోన్న ఎముకలు — రక్తపు బురద జనం కారాగిపోగానే త్రోసుకుంటూ బిలబిల దిగిపోయారు ప్రాణాలు గుండెల్లో దోపుకొని—

కండక్టరు త్యాగశక్తి ఒట్టి మాంసపు కండలూ, ఎముకలప్రోవులూ అయివుంది.

కళ్లలో కాంతిప్రేలాడుతోంది. అదేఏదో చమత్కారంగా నవ్వుతోంది. పెదవులు వేదసంపుటాలవలె కదులుతున్నాయి. కళ్లలో కాంతి మాటలాడుతోంది.

'ఎవరికీ దెబ్బలు తగల్లేదుగదా! నా ఒకడి ప్రేణం పోతేపోయింది. మీరంతా బావున్నారు నాకదే చాలు. చెడ్డపేరు రాకండా మేలుచేశాడు దేవుడు'....అప్రయత్నంగా అతనిచేతులు జోడించుకొన్నాయి.

అందరూ అతనికి ప్రతిగాదణ్ణంపెట్టారు. అందరూ బావురుమని యేడిచారు.

నిండుచూలాలు, గుమాస్తా గిరి(శం) శాస్త్రిగారు, శెట్టిగారు, అందరూ త్యాగయ్యని పునరుచ్చరించుకొన్నారు. ఒక మహానుభావుడు నలభైమంది ప్రాణాలు రక్షించి స్వర్గంచేరుకొన్నాడు.

ఇంతలో డ్రయివరు పరుగెత్తుకుంటూ వచ్చాడు. 'పాపీచిరాయుః' పాపాత్ములు ఎక్కువకాలం బతుకుతారు మంచివాళ్ళని దేవుడు త్వరగా తీసుకుపోతాడు.

అప్పుడే సూర్యుడు ఆకాశం రక్తపుబురదలో అస్తమిస్తున్నాడు. కాలువ విషాదంగా జాలిగొలుపుతూ పారుతోంది.

డ్రయివరు పక్కన నిలబడి కళావంతురాలు నైలాన్‌చీరతో కళ్లు అద్దుకొంది.

(ఇందలి పాత్రలూ, సంఘటనలూ
కల్పితం ఊరిపేర్లు కూడా)

## "జయ మెవరిది?"

రచన : మరువాడ సూర్యప్రకాశం

ఒకనాడు వేసవిలో
ఒక కాకి నీటికై
ఒక ఊరు గాలించి
ఒక ఇంటి వాకిటను
ఒక కుండ యడుగున
ఒక చెంబు నీరుండ
ఒక కంట చూచెన్ ★
ఒక యుక్తి యోచించి
ఒక రాతికుప్పలో
ఒక రాయి చొప్పునన్
ఒక ముక్కుతో గరచి
ఒక నేర్పుచేత నది
ఒంగివేసింది ★
నీరు బయటకు రాగ
కాకి దాహము తీర
కడుపు నిండుగ త్రాగి
కావు కావు మనుచు
గంతులేసింది ★
కాకితెలివైనదా? కోతి తెలివైనదా?
యుక్తికలవారలకు
భుక్తికరవేలేదు
శక్తిగలవారైన
యుక్తిలేకపోతె
శక్తి సన్నగిల్లి
జయ మొందలేరు? ★

★


# కామధేను

ఇది విలువైన మలయాళ మూలికలతో ప్రాచీనాయుర్వేదపద్ధతిని శాస్త్రీయంగా తయారైన గొప్పమందు. వ్యాధిగ్రస్తులె కాక ఎట్టి వ్యాధిలేనివారుకూడా దీనినిసేవిస్తే దేహాన్ని బలపరచి రసాయనంగా పనిచేయును.

**దీనిని స్త్రీ పురుషులు నిరభ్యంతరముగా వాడవచ్చును. మందు మంచి రుచిగావుండును. పథ్యములేదు.**

పిత్యనష్టం, ఋతుదోషం, నరముల నిస్సత్తువ, సెగరోగం, మూత్రదోషం మొదలయిన వ్యాధులకు ఈ మందు పెట్టింది పేరు. మూత్రముతోపోవు శుక్లమును, మేహదుర్నీరును, మేహవ్యాధిని, మేహదురదను, మూగతీటను, జననేంద్రియ సంబంధమైన రుగ్మతలను, జననేంద్రియం సన్నబడుట, చిక్కిపోవుట, లేపనశక్తి తగ్గివుండుట, మధుమేహం, నిద్రలేమి, ధాతు దృఢీకరణం లేకుండుట, నరముల నిస్సత్తువ మున్నగు వ్యాధులను ఇది తప్పక కుదుర్చును. మేహకాక, మూలకాక, గుండెదడ, వెన్నునొప్పి, దగ్గు, కాసము మున్నగు బాధలను నివారణచేయును.

అకలిలేమి, మలబద్ధకం, నీరుకుట్టు, నడుమునొప్పి, కాళ్లుచేతులు తీట, తెలుపువ్యాధి, తలత్రిప్పుట, జ్ఞాపకశక్తి తగ్గుట మొదలైన బాధలను నివారించి బలాన్ని, ఆరోగ్యాన్ని, దేహకాంతిని యిచ్చి యెంతో మేలుచేయును. శీఘ్రంగా ముసలితనం రాకుండా చేస్తుంది.

డబ్బి 1-కి రు. 3=0

**ధనలక్ష్మి అండ్ కో., ★ సౌకార్‌పేట, మద్రాసు-1.**